# పదో తరగతి తెలుగు పేపర్-2 మోడల్ పేపర్

**సమయం: 2 గం. 45 ని.** **గరిష్ట మార్కులు: 50**

## 1. అవగాహన- ప్రతిస్పందన

(16 మార్కులు)

**1.** **రామాయణంలోని ఒక కాండ నుంచి ఇచ్చిన కింది సంఘటనను అనుసరించి సరైన క్రమంలో రాయండి.** $4 \times 1 = 4$

అ) రామలక్ష్మణ సహితుడయి విశ్వామిత్రుడు 'సిద్ధాశ్రమం' చేరుకున్నాడు.
ఆ) దశరథుడు విశ్వామిత్రునికి సముచిత రీతిన మర్యాదలు గావించాడు.
ఇ) తాటక వధతో దుష్ట సంహారానికి పూనుకొన్నాడు రాముడు.
ఈ) వశిష్ఠుని హితవచనాలకు దశరథుడు తలొగ్గాడు.

**2.** **కింది అపరిచిత పద్యాన్ని చదివి, అర్థవంతమైన భావం రాయండి.** $1 \times 4 = 4$

అనువుగాని చోట నధికులమనరాదు
కొంచెమైననదియు గొదువగాదు
కొండ యద్దమందు గొంచెమై యుండదా
విశ్వదాభిరామ ! వినుర వేమ !

(లేదా)

కమలములు నీటబాసిన
గమలాప్తుని రశ్మిసోకి కమలిన భంగిన్
దమ దమ నెలవులు దప్పిన
దమ మిత్రులు శత్రులౌట తథ్యము సుమతీ!

» **కింది అపరిచిత గద్యాన్ని చదివి, ప్రశ్నలకు సమాధానాలు రాయండి.** $4 \times 1 = 4$

జనపదం అంటే పల్లెటూరు. జనపదాలలో ఉండేవారు జానపదులు. వారు పాడుకొనే పాటలు లేదా గేయాలను జానపద గేయాలంటారు. వీటినే ఆంగ్లంలో 'ఫోక్ సాంగ్స్' అంటారు. ఉత్తర భారతదేశంలో జానపద గేయాలను 'లోక్ గీత్' లేదా 'లోక్ సాహిత్య' అంటారు. జానపద గేయానికి ఒక ప్రత్యేక కవి ఉండడు. జానపద గేయం సమష్టి సంపద. శిష్ట సాహిత్యంలాగా కాక జానపద సాహిత్యం పలువురి చేతులలో పెరిగింది. ఇది దాని మొదటి లక్షణం. గేయరచనా కాలం స్పష్టంగా ఉండకపోవడం మరో లక్షణం.

**ప్రశ్నలు:**

**3.** జానపదులు అంటే ఎవరు?
**4.** ఉత్తర భారతదేశంలో జానపద గేయాలను ఏ పేరుతో పిలుస్తారు?
**5.** గద్యాంశంలో పేర్కొన్న సమష్టి సంపద ఏమిటి?
**6.** గద్యాంశం ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి.

» **కింది కరపత్రం చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.** $4 \times 1 = 4$

**చెట్లు – ప్రగతికి మెట్లు**

మొక్కలను నాటుదాం... మొక్కలను కాపాడుదాం...

చెట్లు మానవ మనుగడకు మెట్లు. కానీ నేడు ఆ చెట్లు రోజు రోజుకూ తగ్గిపోతున్నాయి. ఈ కారణంగా పట్టణాలు, నగరాలతో పాటు చివరకు గ్రామాలు కూడా పర్యావరణ కాలుష్యంతో సతమవుతున్నాయి. ఫలితంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. దీనికి కారణం దేశంలో పచ్చని చెట్లు తక్కువగా ఉండడమే. చెట్లు బొగ్గుపులుసు వాయువును పీల్చి మనకు ప్రాణ వాయువును అందిస్తాయి. పర్యావరణ కాలుష్యం నుంచి మనలను కాపాడతాయి. కాబట్టి ప్రతి ఒక్కరూ ఒక్కొక్క మొక్కను నాటి సంరక్షించాలి. ఇది కేవలం ప్రభుత్వ బాధ్యతే అనుకోకుండా ప్రతి ఒక్కరి బాధ్యత అనుకున్న నాడు మొక్కల పెంపకం విరివిగా జరుగుతుంది. ప్రతి పంచాయతీ, పురపాలిక, నగర పంచాయతీ, నగర పాలికలలో ఖాళీ ప్రదేశాలను గుర్తించి మొక్కలను నాటాలి. రక్షించాలి. అప్పుడే గ్రామాలు, పట్టణాలు, నగరాలు, మహా నగరాలు పచ్చని చెట్లతో కళకళలాడుతాయి.

వృక్షో రక్షతి రక్షితః – వృక్షాలను మనం కాపాడితే అవి మనల్ని కాపాడతాయి.

పర్యావరణ పరిరక్షణ సమితి,
రాజంపేట, వైఎస్సార్ కడప జిల్లా,

గౌరీ శంకర్ ప్రింటర్స్, రాజంపేట.
ప్రతులు: 2000

**ప్రశ్నలు:**

**7.** ఈ కరపత్రాన్ని విడుదల చేసిన సంస్థ ఏది ?
**8.** పర్యావరణ కాలుష్యం పెరగడానికి కారణం?
**9.** కరపత్రంలోని ముఖ్య విషయం ఏమిటి?
**10.** కరపత్రం ఆధారంగా ఒక ప్రశ్నను తయారు చేయండి.

## 2. వ్యక్తీకరణ - సృజనాత్మకత

(22 మార్కులు)

» **కింది ప్రశ్నలకు నాలుగు లేదా ఐదు వాక్యాల్లో సమాధానాలు రాయండి.** $5 \times 2 = 10$

**11.** మంథర పాత్ర స్వభావం రాయండి.
**12.** 'నీ చేతిలో చావడం కన్నా శ్రీరాముడి చేతిలో చావడమే నయం. నా జన్మ తరిస్తుంది' అన్న మారీచుని మాటలను బట్టి మీరేమి గ్రహించారు?
**13.** శ్రీరామ సుగ్రీవుల మైత్రిని గురించి రాయండి.
**14.** 'చచ్చి సాధించేదేమిటి? బతికితే సుఖాలను, శుభాలను పొందవచ్చు' అని హనుమంతుడు భావించడానికి గల కారణాలు ఏమిటి?
**15.** విభీషణుడు రాముని శరణు వేడిన విధమెట్టిది?

» **కింది ప్రశ్నకు పది లేదా పన్నెండు వాక్యాలలో సమాధానం రాయండి.** $1 \times 4 = 4$

**16.** సీతారాముల కల్యాణమును గూర్చి రాయండి.

(లేదా)

సేతువు నిర్మాణం గురించి రాయండి.

» **కింది ప్రశ్నలకు సృజనాత్మకంగా సమాధానాలు రాయండి.** $2 \times 4 = 8$

**17.** మీ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టరు గారికి లేఖ రాయండి.

(లేదా)

మీ పాఠశాలలో జరిగే భాషోత్సవాన్ని తిలకించడానికి వచ్చిన ఒక శతక కవిని ఇంటర్వ్యూ చేయండి.

**18.** వీణాకర్ణునికి చూడాకర్ణునికి మధ్య జరిగిన మాటలను సంభాషణా రూపంలో రాయండి.

(లేదా)

మహిళల గొప్పదనాన్ని గురించి కొన్ని నినాదాలు రాయండి

## 3. భాషాంశాలు

(12 మార్కులు)

» కింది ప్రశ్నలకు అడిగిన విధంగా జవాబులు రాయండి. $3 \times 2 = 6$

**19.** 'నిమ్మకు నీరెత్తినట్లు' అనే జాతీయం అర్థాన్ని వివరించి, సొంతవాక్యంలో ప్రయోగించండి.
**20.** 'తెలివి తెచ్చుకోవడం, జ్ఞానోదయం కలగడం' అని చెప్పడానికి ఏ జాతీయాన్ని ఉపయోగిస్తాం?ఆ జాతీయంతో సొంతవాక్యాన్ని రాయండి.
**21.** శ్రీకృష్ణ దేవరాయల ఆస్థాన పండితులలో అల్లసాని పెద్దన గారు అగ్రతాంబూలం అందుకున్నారు.
ఈ వాక్యంలో గల జాతీయాన్ని గుర్తించి, దానిని ఏ సందర్భంలో ఉపయోగిస్తారో రాయండి.

» **కింది ప్రశ్నలకు అడిగిన విధంగా జవాబులు రాయండి.** $12 \times ½ = 6$

**22.** సత్సంగతికంటె లోకమందు మేలేదియు లేదు
(ఈ వాక్యాన్ని ఆధునిక వచనంలో రాయండి.)
**23.** ఏ పాపాత్ముని ముఖంబు వీక్షించితినో
(ఈ వాక్యానికి సరైన ఆధునిక వచనాన్ని గుర్తించి రాయండి.)
అ) యేcబాపాత్ముని ముఖం చూశానో
ఆ) నే పాపాత్ముని ముఖంబు గాంచితినో
ఇ) ఏ పాపాత్ముని ముఖం చూశానో
**24.** లోభము సర్వులకు శ్రేయము కాదు.
లోభము వలన ఆపదలు వచ్చును.
లోభము చేత మోహము పుట్టించబడును
పై వాక్యాలలో ఉన్న ఒక కర్మణి వాక్యాన్ని గుర్తించి రాయండి.
**25.** నా చేత ఎన్నో పుస్తకాలు చదువబడ్డాయి.
(ఈ వాక్యాన్ని కర్తరి వాక్యంగా మార్చి రాయండి.)
**26.** 'నేనొక్కడినే అదృష్టవంతుడినా' అని జంఘాల శాస్త్రి అన్నాడు.
(ఈ వాక్యాన్ని పరోక్ష కథనంలోకి మార్చి రాయండి.)
**27.** **కింది వాక్యాలలో ప్రత్యక్ష కథనాన్ని గుర్తించి రాయండి.** అ) 'నా జీవితం నా రచనలలో ఉంటుంది'అని కవి అన్నాడు.
ఆ) 'తన జీవితం అతని రచనలలో ఉంటుంది' అని కవి అన్నాడు.
ఇ) తన జీవితం తన రచనలలో ఉంటుందని కవి అన్నాడు.
**28.** వెన్నెల అంతటా ప్రకాశించింది.
(ఈ వాక్యం వ్యతిరేకార్థక వాక్యంగా మారినప్పుడు ఇలా మారుతుంది.)
వెన్నెల అంతటా__________
**29.** కింది పదాలలో వ్యతిరేకార్థాన్నిచ్చే క్రియను గుర్తించి రాయండి.

చేసి, చూసి, తిని, చదవక

**30.** కింది వాటిలో సరైన జతను ఎంపిక చేయండి.

అ) వస్తూ, పోతూ – శత్రర్థకాలు

ఆ) వస్తే, పోతే – క్వార్థాలు

ఇ) వచ్చి, పోయి – చేదర్థకాలు

**31.** నేను ప్రతిరోజూ తల్లిదండ్రులకు తప్పక నమస్కరిస్తాను.

(ఇది ఏ రకమైన వాక్యమో రాయండి.)

**32.** మనస్విని, మహేశ్ లు అక్కాతమ్ముళ్లు.

(ఇది ఏ రకమైన వాక్యమో గుర్తించి రాయండి)

అ) సంయుక్త వాక్యం

ఆ) సంశ్లిష్ట వాక్యం

ఇ) నిషేధార్థక వాక్యం

**33.** మీరు పదో తరగతి పరీక్షలలో ఉత్తీర్ణులగుదురుగాక.

(ఇది ఏ వాక్యం? )

## సమాధానాలు

**1.** ఆ) దశరథుడు విశ్వామిత్రునకు సముచిత రీతిన మర్యాదలు గావించాడు.

ఈ) వశిష్ఠుని హితవచనాలకు దశరథుడు తలొగ్గాడు.

ఇ) తాటక వధతో దుష్ట సంహారానికి పూనుకొన్నాడు రాముడు.

అ) రామలక్ష్మణ సహితుడయి విశ్వామిత్రుడు 'సిద్ధాశ్రమం' చేరుకున్నాడు.

**2.** ఓ వేమా ! అద్దమునందు కొండను చూస్తే అది ఎంత పెద్ద కొండయినా చిన్నదిగానే కనపడుతుంది. అలాగే మనుషులు కూడా అనుకూలముగాని స్థలమునందు గొప్పవారమని చెప్పుకోవద్దు. అలా చెప్పకపోవడం వల్ల వారి గొప్పదనానికి ఏ మాత్రం తక్కువ కాదు అని భావం.

**(లేదా)**

ఓ సుమతీ ! నీటిలో ఉండే కమలములు బయటకు వస్తే సూర్యరశ్మి సోకి కమిలిపోతాయి. నీటనున్నపుడు సూర్యుడు కమలములకు మిత్రుడు. నీటినుంచి బయటకు రాగానే శత్రువు. అలాగే తమ సహజ స్థాన ములను విడిచిపెడితే స్నేహితులు కూడా శత్రువు లవుతారు. ఇది నిజమని భావం.

**3.** జనపదాలలో ఉండేవారు.

**4.** 'లోక్ గీత్' లేదా 'లోక్ సాహిత్య'

**5.** జానపద గేయం

**6.** ఆంగ్లంలో జానపద గేయాలను ఏమంటారు?

**7.** పర్యావరణ పరిరక్షణ సమితి

**8.** రోజు రోజుకూ చెట్లు తగ్గిపోతుండడం

**9.** మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం

**10.** ఈ కరపత్రానికి గల శీర్షిక ఏమిటి?

**11.** రామాయణంలో మంథర పాత్ర ఎంతో విశిష్టమైంది. శ్రీరామ వనవాసానికి ప్రధాన కారకురాలు. కైకకు సహాయకురాలు. పచ్చని కాపురంలో చిచ్చు పెట్టే స్వభావంగలది. కైక మనసులో దుర్బుద్ధిని పుట్టించింది. ఒక దుష్టపాత్రగా రామాయణం లో నిలిచిపోయింది.

**12.** సీతాపహరణంలో తనకు సహకరించమని రావణుడు మారీచుని కోరగా ఆ ఆలోచన మంచిదికాదని హితవు పలికాడని గ్రహించాను. ఇతరులకు హాని చేయాలనే ఆలోచన లేకుండా ప్రశాంతంగా ఉన్న రాముణ్ణి కవ్వించడం కొరివితో తల గోక్కోవడం వంటిదని వాస్తవం పలికాడని గ్రహించాను. రాముడు విషయంగా మారీచుడు తాను అనుభవించిన విషయాన్ని రావణునికి తెలిపాడని గ్రహించాను. బంగారు లేడిగా మారి తనకు సహకరించమని రావణుడు అడిగినప్పుడు మారీచుడు 'నీ చేతిలో చావడం కన్నా రాముని చేతిలో చావడమే నయమని, తన జన్మ తరిస్తుంది' అని చెప్పాడని గ్రహించాను.

**13.** రామలక్ష్మణులు సుగ్రీవునితో మైత్రి చేయాలని ఋష్యమూక పర్వతం దగ్గరకు వచ్చారు. సుగ్రీవుడు రామలక్ష్మణులను చూసి వాలి తనను చంపడానికి పంపిన వీరులని భయపడ్డాడు. రామలక్ష్మణులను గురించి తెలుసుకోమని సుగ్రీవుడు మంత్రి హను మంతుణ్ణి కోరాడు. హనుమంతుడు సుగ్రీవుని గూర్చి రామలక్ష్మణులకు చెప్పి, తాను సుగ్రీవుని మంత్రిననీ, తన పేరు చెప్పాడు. హనుమతో లక్ష్మణుడు తమకు సుగ్రీవుని సా యం కావాలని చెప్పాడు. హనుమ రామ లక్ష్మణులను తన భుజాలపై ఎక్కించుకొని సుగ్రీవుని వద్దకు తీసుకొని వచ్చాడు. శ్రీరామ సుగ్రీవులు అగ్నిసాక్షిగా స్నేహితుల య్యారు.

**14.** సీతాన్వేషణలో భాగంగా హనుమంతుడు లంకకు చేరాడు. ఎక్కడా సీత జాడ తెలియకపోయేసరికి సీత మరణించిందేమోనని సందేహించాడు. ఏ ముఖం పెట్టుకొని తిరిగి వెళ్లాలని బాధపడ్డాడు. సీత కనపడలేదని చెబితే శ్రీరాముడు మొదలు వానరజాతి వరకు అందరూ బతకరు. ఇంతమంది మరణానికి కారణం కావడం కన్నా తానే చావడం మంచిదనిపించింది మారుతికి. ఇది తప్పు. బతికుండడమే అన్ని విధాలుగా ఉత్తమమని భావించాడు హనుమంతుడు. బతికుంటేగదా ఏదైనా సాధించవచ్చు. చచ్చిసాధించేదేమీ లేదుగదా. బతికుంటే సుఖాలను, శుభాలనూ పొందవచ్చు.

**15.** రావణుని సోదరుడు విభీషణుడు. సీతను అపహరించి తీసుకురావడం ధర్మం కాదని విభీషణుడు రావణునితో పలికాడు. దాంతో రావణుడు క్రోధావేశాలకు లోనయ్యాడు. ధర్మం వీడిన రావణుని వీడడానికే విభీషణుడు నిర్ణయించుకున్నాడు. రెండు గడియల్లో రామలక్ష్మణులున్న చోటికి నలుగురు అనుచరులతో చేరాడు. ఆకాశంలోనే నిలిచి శ్రీరాముణ్ణి శరణుకోరాడు విభీషణుడు. రాముడు విభీషణుణ్ణి అనుగ్రహించాడు. ఆలింగనం చేసుకున్నాడు.

**16.** విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో 'జనక మహారాజు యజ్ఞం చేస్తున్నాడు. అక్కడ ఒక మహా ధనస్సు ఉంది. అక్కడకు వెళదాం' అన్నాడు. రామలక్ష్మణులు విశ్వామి త్రుని వెంట మిథిలకు బయలుదేరారు. మిథిలా నగరం సమీపంలోని గౌతమ మహర్షి ఆశ్రమాన్ని సందర్శిం చారు. అక్కడ బూడిద రూపంలో వున్న అహల్యకు మహర్షి ఆదేశంపై శ్రీరాముడు శాప విముక్తిని కలిగించాడు.

మిథిలాను చేరుకున్న వీరిని జనకుడు ఆదరించాడు. అహల్య, గౌతముల కుమారుడు శతానందుడు రామునికి కృతజ్ఞతలు చెప్పాడు. విశ్వామిత్రుడు జనకునితో 'వీరు దశరథ పుత్రులు రామలక్ష్మణులు. నీ వద్దగల ధనస్సును చూద్దామని వచ్చారు. చూపించు. శుభం కలుగుతుంద'ని చెప్పాడు. జనకుడు శివ ధనస్సు చరిత్రను వివరించి తనకూతురు సీత నాగటిచాలులో దొరికిందనీ, శివధనస్సును ఎక్కుపెట్టగల వీరునకిచ్చి పెండ్లి చేస్తానని చెప్పాడు. చాలామంది రాజులు శివధనస్సును ఎక్కుపెట్టలేకపోయారని చెప్పాడు

విశ్వామిత్రుడు శివధనస్సును తెప్పించమన్నాడు. ఐదు వేలమంది ఆ ధనస్సు ఉన్న పెట్టెను తెచ్చారు. రాముడు పట్టుకోగానే అది వంగింది. నారి ఎక్కుపెట్టగా ఆ ధనస్సు పెళపెళమని ధ్వనిచేస్తూ విరిగింది. జనకుడు సీతారాములకు పెండ్లి చేయడానికి సిద్ధమయ్యాడు. దశరథునికి కబురు పెట్టారు. అయోధ్య నుండి అందరూ వచ్చారు. జనకుడు తన కుమార్తెలు సీత, ఊర్మిళలను రామలక్ష్మణులకు, తన తమ్ముడు కుశధ్వజుని కుమార్తెలు మాండవి, శ్రుతకీర్తిలను భరత, శత్రుఘ్నులకు ఇచ్చి పెండ్లి జరిపించాడు.

ఇలా సీతారాముల కళ్యాణం ఎంతో రమణీయంగా జరిగింది.

**(లేదా)**

రావణుని రాజ్యమైన లంకలోవున్న సీతమ్మను తీసుకురావడం కోసమై సముద్రాన్ని దాటే ఉపాయమేమిటని శ్రీరాముడు సుగ్రీవుణ్ణి ప్రశ్నించాడు. సముద్రుణ్ణి ప్రార్థించడం వల్ల ఇది సాధ్యపడుతుందని విభీషణుడు చెప్పాడు. అపుడు శ్రీరాముడు సముద్రతీరంలో దర్భాసనం మీద కూర్చుని సముద్రుణ్ణి ఉపాసించాడు. మూడు రాత్రులు గడిచాయి. సముద్రుడు ఎదుట నిలవలేదు. శ్రీరాముని కన్నులు ఎర్రబడ్డాయి. సముద్రుడి అహంకారాన్ని అణగదొక్కాలనుకున్నాడు. నీటినంతా ఇంకిపోయేటట్లు చేయాలనుకున్నాడు. బ్రహ్మాస్త్రాన్ని స్మరించాడు. ప్రకృతంతా అల్లకల్లోల మవుతుంది. సముద్రుడు భయపడి పారిపోతున్నాడు. పరుగెత్తేవానిపై బాణం ప్రయోగించరాదని ఆగాడు శ్రీరాముడు. సము ద్రుడు దారికి వచ్చాడు. లంకకు వెళ్లడానికి దారినిస్తానన్నాడు. ఎక్కుపెట్టిన బాణం వృథాకారాదు. ఎక్కడ ప్రయోగించాలో చెప్పమన్నాడు శ్రీరాముడు. పాపాత్ములు, దోపిడీదారులు ఉండే 'ద్రుమకుల్యం' పైన ప్రయోగించమన్నాడు సముద్రుడు. అలానే చేశాడు శ్రీరాముడు.

విశ్వకర్మ కుమారుడైన 'నలుడు' శిల్పకళా నిపుణుడు. ఉత్సాహం, శక్తి ఉన్నవాడు. సేతువు(వంతెన)ను నిర్మించడానికి అతడే యోగ్యుడని సముద్రుడు తెలిపాడు. ఆ సేతువును తానుభరిస్తానని మాట ఇచ్చాడు. సేతువు నిర్మాణానికి వానర నాయకులకు ఆజ్ఞ ఇచ్చాడు శ్రీరాముడు. అందరూ మహారణ్యం దారిపట్టారు. పెద్ద పెద్ద చెట్లను, బండరాళ్లను మోసుకువస్తున్నారు. సముద్రంలో పడేస్తున్నారు. వాటి దెబ్బకు సముద్రంలోని నీరు ఆకాశానికి ఎగిసిపడుతున్నది. నలుని సూచనల ననుసరించి కొలతల ప్రకారం సేతువు నిర్మాణం జరుగుతోంది. వంద యోజనాల పొడవు, పది యోజనాల వెడల్పు గల సేతువు నిర్మాణం ఐదు రోజులలో పూర్తయింది.

ఇలా సేతువు నిర్మాణం జరిగింది.

**17.**

ఆకేపాడు,
18.02.2020.

మహారాజశ్రీ గౌరవ..
జిల్లా కలెక్టరు గారికి,
వైఎస్సార్ కడప జిల్లా .

మహాశయా !

నేను రాజంపేట మండలంలోని ఆకేపాడు గ్రామానికి చెందినవాడిని. మా గ్రామంలోని ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్య, మురుగునీటి పారుదల సమస్య, పారిశుద్ధ్యలోపం, దోమలబాధ తదితర సమస్యలు

మమల్ని పట్టి పీడిస్తున్నాయి. వీటి పరిష్కారం కోసం స్థానిక ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం శూన్యం.కాబట్టి మీరైనా మా గ్రామ సమస్యలపై తక్షణం స్పందించి తగుచర్యలు తీసుకొని మమ్ములను సమస్యల నుంచి విముక్తులను చేయవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

నమస్కారములతో ...
ఇట్లు,
మీ విధేయుడు,
మధుసూధన రాజు.

చిరునామా : జిల్లా కలెక్టరు,
వైఎస్సార్ కడప జిల్లా.

(లేదా)

1) నమస్కారమండీ! మీ పేరు తెలుసుకోవాలని కుతూహలపడుతున్నాను. తెలుపగలరా ?
2) మీరు రచించిన శతకాలేవో తెలపండి?
3) మీ శతకంలో గల మకుటాన్ని గురించి వివరిస్తారా?
4) నీతి పద్యాల ప్రాముఖ్యతను తెలపండి?
5) విద్యార్థులలో నైతిక విలువలు పొంపొందాలంటే ఏం చేయాలి?
6) మా పాఠశాలలో జరిగిన 'శతక పద్య ధారణా కార్యక్రమం' భాషోత్సవం గురించి మీ అభిప్రాయం?
7) ఎవరి ప్రభావం కారణంగా మీరు కవి పండితులయ్యారు?
8) మీకు స్ఫూర్తినిచ్చిన కవులు ఎవరు?
9) మీ లాగే మేము కూడా కవి పండితులం కావాలంటే ఏం చేయాలి?
10) చివరగా... కవిగా మీరు మాకు (విద్యార్థులకు) ఇచ్చే సందేశం ?

**18.** వీణాకర్ణుడు: మిత్రమా ! ఏమిటి ? పైకి చూస్తూ నేలమీద గిలుక కర్రతో కొడుతున్నావు ?

చూడాకర్ణుడు: ఏమి లేదు మిత్రమా! ఒక ఎలుక నిత్యమూ చిలుక కొయ్యమీద పాత్రలో దాచిపెట్టిన అన్నాన్ని తిని పోతోంది.

వీణాకర్ణుడు: ఏమిటీ! ఎలుకనా ?

చూడాకర్ణుడు : అవును. ఈ ఎలుక వల్ల నాకు ఉపద్రవం ఎక్కువగా ఉంది.

వీణాకర్ణుడు: ఎక్కడి ఎలుక? ఎక్కడి చిలుక కొయ్య? ఇంత చిన్న జంతువుకు అంత ఎత్తు ఎగరగల బలం ఎలా వచ్చి ఉంటుంది ? దీనికేదో ఒక కారణం తప్పక ఉండి ఉంటుంది?

చూడాకర్ణుడు: ఏమి కారణమో ఏమో. చాలాకాలం నుంచి దీనివల్ల బాధపడుతూనే ఉన్నాను.

వీణాకర్ణుడు: ఈ ఎలుకకు ఇంత బలం, ఇక్కడ నిత్య నివాసం, కారణం లేకుండా రానేరావు.

చూడాకర్ణుడు : నిజమేనేమో. ఇక్కడే కన్నంలో నివాసం ఉంటోంది. ఇలా ఉండడానికి గల కారణం తెలియదు.

వీణాకర్ణుడు : దానికి కారణం తెలియాలంటే ఆ కన్నాన్ని తవ్విచూడాలి మిత్రమా.

చూడాకర్ణుడు : సరే అలాగే తప్పకుండా తవ్వి చూస్తాను.

(లేదా)

ఇంటికి దీపం – ఇల్లాలు
ఇల్లాలి చదువు – ఇంటికి వెలుగు
మహిళల చదువు – మహికే వెలుగు
స్త్రీలను గౌరవించడం – భారతీయ సంప్రదాయం
భారతీయ వనితలు – భాగ్య కల్పలతలు
స్త్రీ అబల కాదు – ఆకసాన్నందుకుంటున్న సబల
స్త్రీల రక్షణ – మన జాతి రక్షణ
నేటి బాలికలే – రేపటి మహిళలు
మహిళలు– మన జాతి రత్నాలు

**19.** ఎలాంటి ఆందోళన, అలజడి లేకుండా ప్రశాంతంగా ఉండడం అనే అర్థం వచ్చే సందర్భంలో ఈ జాతీయాన్ని ఉపయోగిస్తారు.
పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నా సురేంద్ర నిమ్మకు నీరెత్తినట్లున్నాడు.

**20.** కనువిప్పు అనే జాతీయాన్ని ఉపయోగిస్తాం.
మా తెలుగు మాష్టారు చెప్పిన నీతి కథలతో నాకు కనువిప్పు కలిగింది.

**21.** అగ్రతాంబూలం.
గొప్పవారిని ముందుగా గౌరవించడం/ గొప్పవారికి మొదటి ప్రాధాన్యతనివ్వడం అనే సందర్భంలో ఈ
జాతీయాన్ని ఉపయోగిస్తారు.

**22.** మంచి స్నేహం కంటే లోకంలో మరొక మేలు లేదు.

**23.** ఇ) ఏ పాపాత్ముని ముఖం చూశానో.

**24.** లోభం చేత మోహం పుట్టించబడును.

**25.** నేను ఎన్నో పుస్తకాలు చదివాను.

**26.** తానొక్కడినే అదృష్టవంతుడినాయని జంఘాలశాస్త్రి అన్నాడు.

**27.** అ) 'నా జీవితం నా రచనల్లో ఉంటుంది' అని కవి అన్నాడు.

**28.** వెన్నెల అంతటా ప్రకాశించలేదు.

**29.** చదవక

**30.** అ) వస్తూ, పోతూ – శత్రర్థకాలు

**31.** నిశ్చయార్థక వాక్యం

**32.** అ) సంయుక్త వాక్యం

**33.** ఆశీర్వార్థక వాక్యం

www.sakshieducation.com